ప్రతినిధులతో నిండిపోయిన సభా ప్రాంగణంలో ఒక భాగం

శాస్త్రీయమైన విద్యను అందించాలి

- పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ లక్ష్మణరావు
- ఘనంగా ప్రారంభమైన యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ
- రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మంది హాజరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ కాకినాడలో ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులతో ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. పలువురు ప్రముఖులు, అధికార పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు సైతం హాజరై అమూల్యమైన సందేశాలు ఇచ్చారు. ప్రజానాట్యమండలి కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేమన కళారూపానికి మంచి స్పందన వచ్చింది

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

అందరికీ న్యాయమైన, శాస్త్రీయమైన విద్యను అందించాలని, ఇది ప్రభుత్వ విద్యారంగం ద్వారా మాత్రమే సాధ్యమని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ ఆదివారం కాకినాడ పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సభలకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి సుమారు 20వేల మంది ప్రతినిధులు తరలి వచ్చారు. తొలుత సీనియర్ నాయకులు కె.సత్తిరాజు జాతీయ పతాకాన్ని, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు జి.చిట్టిబాబు ఆవిష్కరించారు. ఈ మహాసభలకు సూచికగా 17 పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యా రంగంలో సామాజిక న్యాయాన్ని కాపాడడానికి కృషి చేయాలన్నారు. గ్రామానికి ఒక ప్రాథమిక పాఠశాల, ఐదు తరగతి గదులు, ఐదుగురు ఉపాధ్యాయులతో ఉండాలన్నారు. విద్యారంగం పట్ల ఒక సమగ్రమైన విధానాన్ని ప్రభుత్వం ప్రకటించాలన్నారు.

ఎంఎల్‌సిలు ఐవి, గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల, ఉద్యోగుల అందరి ఐక్యత కోరేది యుటిఎఫ్ అన్నారు. నేడు కేంద్రం, రాష్ట్రంలో పాలన రాజ్యాంగ బద్ధంగా జరగట్లేదన్నారు. పెద్ద సంఘంగా ఉన్న యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా సామాజిక బాధ్యతగా పలు కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రాజ్యాంగ హక్కుల రక్షణకు అందరూ పోరాడాలన్నారు. ఆహ్వాన సంఘం ఛైర్మన్, ఎన్‌టిఆర్ యూనివర్సిటీ మాజీ విసి డాక్టర్ ఐవి.రావు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక కేంద్రంగా వర్ధిలుతున్న కాకినాడ నగరం అందరికరీ స్వాగతం పలుకుతుందన్నారు. మాజీ ఎంఎల్‌సి వి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నిలదీస్తూ విద్యారంగాన్ని కాపాడుతున్న సంఘం యుటిఎఫ్ అని కొనియాడారు.

రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్రంలోనే చాలా బలమైన సంఘంగా ఉందన్నారు. మహాసభ జరుపుకుంటున్న సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. తమ తల్లిదండ్రులు యుటిఎఫ్ సభ్యులుగా ఉండేవారని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన తాను 20 ఏళ్ల పాటు ఐఎఎస్‌గా సేవలు అందించానని గుర్తు చేసుకున్నారు. నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తూ జగన్ ప్రభుత్వం డ్రాపౌట్స్ పెంచిందని, అనేక స్కూల్స్ మూతపడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని మెరుగుపరిచే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి తనకు ఎంతో ఇష్టమన్నారు. గౌరవప్రదమైన వృత్తిని సాగిస్తూనే ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యుటిఎఫ్ కృషి చేయడం అభినందనీయమన్నారు.

సభకు అధ్యక్షత వహించిన యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెన్నుపాటి ఆశయ సాధనను ముందుకు తీసుకెళ్లడం కోసం నిరంతరం యుటిఎఫ్ పనిచేస్తుందన్నారు. ఎర్రజెండా అంటే పాలకులకు వణుకు పుడుతుందన్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను ఆయన వివరించారు.

ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సిఎన్.భారతి మాట్లాడుతూ ఎన్ఇపికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఒపిఎస్ సాధించేవరకూ ఒకే తాటిపై నిలబడి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.రవి, ఎ.వెంకట్ ఎపిటిఎఫ్(1938) రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, ఎపి యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.సత్తరాజు

ప్రజానాట్య మండలి కళాకారులు వేమన కళారూపం

సాబ్జీ జీవిత చరిత్రపై రాసిన 'నా పయనం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సిలు

ఉత్సాహంగా సాగిన సదస్సులు

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకురాలు రమాదేవి

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభలో భాగంగా ప్రాంగణంలో గురువారం ప్రజాచైతన్య సదస్సు, ఉద్యమ సదస్సులు ఆలోచింపజేశాయి. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ప్రజా చైతన్య సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.రమాదేవి ముఖ్యవక్తగా పాల్గొన్నారు. మాజీ ఎంఎల్‌సి, సిపిఐ నాయకులు విల్సన్, పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి జి.నాగమణి, కాకినాడ డివైఇఒ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఎల్‌సిలు ఐవి, కెఎస్.లక్ష్మణరావు, గోపిమూర్తి తదితరులు పాల్గొన్నారు. పాలకుల విధానాల వల్ల కేంద్ర, రాష్ట్రంలోని విద్యావ్యవస్థలో వచ్చిన పోకడలను రమాదేవి వివరించారు. ప్రయివేటీకరణ వల్ల విద్యారంగం నాశనమైన తీరును విశదీకరించారు. వీటిపై పోరాడాలని దీనికి సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. విల్సన్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థ మొత్తం తన చెప్పు చేతల్లో పెట్టుకుని రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం ఎన్ఇపిని తీసుకొచ్చిందన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి జి.నాగమణి మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలు ఎక్కువ అవ్వడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించుకోవాలని సూచించారు. డివైఇఒ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక విద్యారంగాన్ని పరిరక్షించు కోవాలన్నారు. అనంతరం జాతీయ అవార్డు గ్రహీత శ్రీకాకుళం జిల్లాకు చెందిన హెచ్‌ఎం ఎం.నాగేశ్వరరావును పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఘనంగా సత్కరించారు.

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఉద్యమ సదస్సులో యుటిఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కె.జోజయ్య ప్రారంభోపన్యాసం చేశారు. సీనియర్ నాయకులు జి.చిట్టిబాబు, పి.బాబురెడ్డి, కమలాకుమారి, రమణయ్య శాస్త్రి, న్యాయవాది అప్పారి సత్యప్రసాద్ మాట్లాడారు. యుటిఎఫ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ వృత్తితో ఎన్నో అద్భుతాలు సాధించొచ్చన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలన్నారు.

ఉద్యమ సదస్సులో మాజీ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ భార్య షేక్ బేగం మాట్లాడారు. తామ కుటుంబమంతా ఉపాధ్యాయులమేనని తెలిపారు. 34 ఏళ్ల పాటు సాబ్జీ అనేక పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రమాదవశాత్తు కర్తవ్యం నిర్వహణలో మరణించడం తమ కుటుంబానికి తీరని లోటు అన్నారు. సాబ్జీ అందరి మనసుల్లో ఉంటారని ఆశిస్తున్నాను. సాబ్జి జీవిత చరిత్రపై రాసిన 'నా పయనం' పుస్తకాన్ని ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐవి, గోపి మూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు తదితరులు ఆవిష్కరించారు.

నాయకుల గీతాలాపన

సిఎన్.భారతి
ఎపిటిఎఫ్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి

బొర్రా గోపిమూర్తి
పిడిఎఫ్ ఎంఎల్‌సి

ఐ.వెంకటేశ్వరరావు
పిడిఎఫ్ ఎంఎల్‌సి

ఐ.వెంకటేశ్వరరావు
పిడిఎఫ్ ఎంఎల్‌సి

కర్రి పద్మశ్రీ, ఎంఎల్‌సి

రాపాక వరప్రసాదరావు
ఎంఎల్ఎ, రాజోలు

విఠపు బాలసుబ్రహ్మణ్యం
మాజీ ఎంఎల్‌సి

ఎన్.వెంకటేశ్వర్లు
యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభల ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

రావులపాలెం రూరల్ సిఐ విద్యాసాగర్

ప్రజాశక్తి - కొత్తపేట

సంక్రాంతి పండుగ సందర్భంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే కొత్తపేట ప్రభల ఉత్సవాలు (తీర్థం) శాంతియుతంగా నిర్వహించేలా ఉత్సవ కమిటీ అన్ని చర్యలు తీసుకోవాలని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ సూచించారు. కొత్తపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రభల ఉత్సవ కమిటీ సభ్యులతో ఎస్ఐ జి.సురేంద్ర అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐ విద్యాసాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రభల ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలకు తావు లేదని స్పష్టం చేశారు. అశ్లీల నృత్యాలు మంచి సాంప్రదాయం కాదని, యువతకు క్రీడా పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు వంటివి నిర్వహించాలని హితవు పలికారు. నిబంధనలకు లోబడి ఉత్సవాలు జరుపుకోవాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, గుండాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామన్నారు. బాణసంచా కాల్పుల సమయంలో ఉత్సవ కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్తపేట ప్రభల తీర్థానికి వివిధ ప్రాంతాల నుంచి ఊరేగింపుగా ప్రభలను తీసుకొచ్చే సమయంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఉత్సవ కమిటీలు వ్యవహరించాలని సూచించారు. కుల, మత, రాజకీయ పరంగా రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా, వివాదాలు సృష్టించినా సహించేది లేదని చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాల నిర్వాహకులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సంబంధిత వ్యక్తులతో పాటు నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ప్రజలు సంతోషంగా జరుపుకునేలా సమన్వయంతో పనిచేయాలని, పోలీసులు తీసుకునే చర్యలకు సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న రూరల్ సిఐ విద్యాసాగర్

సమావేశంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

సొసైటీ పదవులపై కూటమి నేతల కన్ను

ప్రజాశక్తి - అంబాజీపేట

కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి లోగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా త్రీ మెన్ కమిటీగా నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలని సమాయత్తం అవుతోంది ఈ నేపథ్యంలో సొసైటీలో అర్హత లేని వ్యక్తులు కూడా పదవుల కోసం జోరుగా సభ్యత్వాలు తీసుకుని పైరవీలు కొనసాగుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సొసైటీ లో సభ్యత్వం రావాలంటే కనీసం 25 సెంట్లు సొంత భూమి కలిగి ఉండాలి, లాకర్ లావాదేవీలు కొనసాగుతూ ఉండాలి, సొసైటీ సంఘంలో డిపాజిట్ దారుడై అయినా అయి ఉండాలి. అంబాజీపేట మండల పరిధిలో అంబాజీపేట, గంగలకుర్రు, పుల్లేటికుర్రు, ముక్కామల, చిరుతపుడి,ఇరుసుమండ సొసైటీలు ఉన్నాయి. పి.గన్నవరం నియోజకవర్గ పరిధి అంబాజీపేట, మామిడికుదురు, పి.గన్నవరం, అయినవిల్లి, మండలాల పరిధిలో ఒక్కో మండల పరిధిలో సుమారు ఐదు నుంచి ఆరు సొసైటీలు ఉన్నాయి. నియోజకవర్గం పరిధిలో సుమారు 25 సొసైటీలలో కొన్ని సొసైటీలలో రూ.కోట్లు లావాదేవీలు, వ్యాపార లావా దేవీలతో ముడిపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల సపోర్టుతో అనర్హులకు పట్టం కట్టే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. సొసైటీ పాలకవర్గాలు అర్హులైన రైతులతో ఏర్పాటు చేస్తారా..? లేదా అనార్హులైన వారితో పాలకవర్గాలు ఏర్పాటు చేస్తారా..? చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై నియోజకవర్గ ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పరిశీలించి అర్హులైన రైతులకు ఎంపిక చేయాలని రైతులు కోరుతున్నారు. నియోజకవర్గంలో అతిపెద్ద సొసైటీ అయిన అంబాజీపేట సొసైటీ జనసేన కీలక నాయకులు అరిగెల సూరిబాబును ఎంపిక చేయగా జనసేనలో రెండో వర్గం కొర్లపాటి వారిపాలెంకు చెందిన సీనియర్ జనసేన నాయకుడు, రైతు నాయకుడు ఎంఎల్ఎని కలిసినట్లు సమాచారం. ఈ సొసైటీకి పోటీతత్వం పెరగడంతో చివరి నిమిషంలో సొసైటీ పదవు టిడిపికి మార్చే అవకాశం ఉన్నట్లు వినికిడి. అంబాజీపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి జనసేనకి కేటాయించాలనే అంశంపై సమాలోచనలు జరగుతున్నట్లు తెలుస్తోంది. ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ కూటమిలో ఈ వర్గ పోరులో ఏ పార్టీ నాయకునికి కేటాయిస్తారో వేచి చూడాల్సిందే.

అంబాజీపేట సొసైటీ

డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఇబిసిలకు చెందిన అభ్యర్థులకు ఎపి బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డిఎస్‌సి-2024 పరీక్షలకు ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా బిసి సంక్షేమ సాధికారత అధికారి పి. సత్య రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురంలో జిల్లా బిసి సంక్షేమ సాధికరత అధికారి వారి కార్యాలయం నందు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిల వారు 100 మందికి ఇబిసిలకు - 20 మంది అభ్యర్థులకు రెండు నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తారన్నారు. అభ్యర్థులు బిఇడి లేక టిటిసితో పాటు ఎపి టెట్ పరీక్షలో అర్హత సాధించి ఉండవలెను. ఎపి టెట్ లో అత్యధిక మార్కులు పొందిన 100 మంది అభ్యర్థులు కు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ బయోడాట 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బిఇడి, టిటిసి, టెట్ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు ప్రకటన వెలువడిన తేదీ నుంచి జనవరి 20వ తేదీ 2025లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఇబిసి లకు చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సత్య రమేష్ పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ నెం.70934 01225, 94404 03629ల్లో సంప్రదించ వచ్చున్నారు.

బాధితునికి చికిత్స నిమిత్తం 'శ్రీ నేస్తం' సాయం

ప్రజాశక్తి - రాజోలు:

చికిత్స నిమిత్తం ఆదివారం బాధితునికి శ్రీనేస్తం సేవా సమితి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని కూన వరం గ్రామానికి చెందిన లక్కోజు రాంబాబు రెండు కిడ్నీలు పనిచే యడం లేదు. దీంతో ఆయనకు వైద్య చికిత్స నిమిత్తం శ్రీ నేస్తం సేవాసమితి సమకూర్చిన రూ.25 వేలను మాజీ నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ చేతుల మీదుగా అంద జేశారు ఈ కార్యక్రమ ంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ చెల్లింగి అబ్బులు, కూనవరం ఎంపిటిసి సభ్యుడు చెల్లుబోయిన పెద్ద, చెల్లింగి శ్రీను, దొంగ స్వామి, చెల్లుబోయిన రామకృష్ణ, చెల్లింగి మురళి, జానికిరామయ్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రూ.25 వేలు అందజేస్తున్న శ్రీనేస్తం సేవా సమితి సభ్యులు

7న వికాస ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - అమలాపురం

వికాస ఆధ్వర్యంలో ఈ నెల 7న మెగా జాబ్ మేళా నిర్వ హిస్తున్నట్లు కలెక్టర్ రావిలాల మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు కొంతవరకు చదివిన చదువుకు తగినట్లు ఉపాధి దొరకక పోయినా జీవించేందుకు అవ సరమైన కనీస సంపాదనకు నోచుకోని ఉద్యోగార్థులకు వికాస సంస్థ భరోసాగా నిలిచి ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు కల్పనకు శ్రమిస్తోందన్నారు. చదువుకో వాలని ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు, పేదరికం, తండ్రి సంపాదన కుటుంబ అవసరాలకు సరిపోని కారణంగా మధ్యలో చదువులు మానేసిన నిరుద్యోగ యువత కు భరోసాగా వికాస సంస్థ నిలుస్తోందన్నారు. పరిశ్రమలు సేవా రంగాల సమన్వయంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశా లు కల్పిస్తోందన్నారు. నిరుద్యోగ యువత నేటి ఆధునిక యుగంలో మారు తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విని యోగించుకుని అభివృద్ధి పథంలో పయనించాలన్నా రు. ఈనెల 7న మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో వికాస సంస్థ జిల్లా కార్యాలయం నందు నిర్వహించే జాబ్ మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకో వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హ్యుందాయ్ మొబీస్, ఐటెక్ సాఫ్ట్వేర్ సొల్యూ షన్స్ వంటి కంపెనీలలో ఉద్యోగాల భర్తికి వికాస ఆఫీస్ కలెక్టరేట్ నందు ఇంటర్వ్యూలు ఆయా కంపెనీల మానవ వనరుల అధికారుల ద్వారా నిర్వహిస్తారన్నారు. వివరాలకు www.vika sajobs.com నందు లాగిన్ అయ్యి తెలుసుకో గలరని వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వికాస కార్యాల యం లో ఉదయం 9 గంటలకు అర్హత, ఆసక్తి ఉన్న వారు స్వయంగా అన్ని రకాల ఒరిజినల్ సర్టిఫికెట్స్ విద్యార్హత, అనుభవం, వయస్సు, ఆధార్, ధ్రువీకరిణ పత్రాలతో ఈనెల 7న ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

7న రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో

రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈనెల 7న రామచంద్రపురం పట్టణంలోని ఎస్‌కెపి ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో గల స్కిల్ హబ్ లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ వి. సోమశేఖర రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను తమ కంపెనీలకు ఎంపిక చేసుకుంటాయన్నారు. నిరుద్యోగ యువత పది నుంచి డిగ్రీ వరకు పూర్తి చేసిన వారు పాల్గొనాలన్నారు. నియోజవర్గం ప్రజలు, పరిసర ప్రాంతాల్లో నిరుద్యోగులు అంతా ఈ జాబ్‌మేళా ను ఉపయోగించుకొని ఉపాధిని పొందవలసిందిగా సూచించారుమరిన్ని వివరాలకు కింది నెంబర్లు సంప్రదించాలని తెలియజేశారు. 9948404165, 8247645389

కార్టూన్ 'నిజం'



ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - మండపేట

మండపేట ఏడిద రోడ్డులోని ఎస్‌విఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో 1975లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ కల యిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. తాము ఈ పాఠశాల్లో చదివి 50 ఏళ్లు అయినా సంద ర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంచనాల కమిటీ ఛైర్మన్ ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు హాజర య్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎంఎల్ఎ మాట్లాడుతూ తాను ఇదే స్కూల్లో విద్య అభ్యసిం చానని అన్నారు. ఇక్కడ విద్యార్థులు చాలా మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొ న్నారు. 1975 బ్యాచ్ చేపట్టిన సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. అనంతరం అప్పటి తెలుగు అధ్యాపకులు గుంటురి సాంబ శివరామ శర్మ, లెక్కల అధ్యాపకులు అద్దంకి వీర్రాజులను పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు. మూడేళ్ల క్రితం పాఠశాలకు పలు రకాలు వస్తువులను పూర్వ విద్యార్థులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి తమ బ్యాచ్ తరపున రూ.10 వేలు నగదు అవార్డు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సుమారు 90 మంది పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమం లో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించాలని సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము అన్నారు ఆదివారం ఆత్రేయపురం రేవులో వాహనచోదకులకు హెల్మెట్ ధరించి వాహనం నడపడం ద్వారా కలిగే ఉపయోగాలు గురించి తెలియజేశారు. ద్విచక్ర వాహనం పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించకుండా వాహన చోదకులు పలు ప్రమాదాలు గురై తలకు గాయాలయి మృత్యువాత పడిని సందర్భాలు ఉన్నాయని అన్నారు. **కొత్తపేట**: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ జి.సురేంద్ర అన్నారు. ఆదివారం ఆయన పలు అంశాలపైన మోటర్ మెకానిక్‌లకు అవగాహన కల్పించే విధంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేంద్ర మాట్లాడుతూ ప్రతి వాహనదారులు వాహనం నడపాలంటే కి (తాళము) ఎంత అవసరమో అదేవిధంగా హెల్మెంట్ అంత అవసరమని అన్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ఉపయోగించే విధానం అలవాటు చేసేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. హెల్మెట్ ధారణ కోసం మైక్ పబ్లిసిటీ ,ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు. వాహదారులు సైలెన్సర్ ఈ మోడల్స్ తీసుకురామన్నా తీసుకురాకూడని, నెంబర్ లేని నెంబర్ ప్లేట్లు తీసుకువచ్చి అమర్చమన్నా అమర్చరాదని తెలిపారు.

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం ఈనెల 6వ తేదీ సోమ వారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లోని గోదావరి భవన్ లో నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విష యాన్ని గమనించి మీ కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి తగు పరిష్కార మార్గాలు పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయి తోపాటు డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయిలో కూడా మీకోసం కార్య క్రమం నిర్వహిస్తారన్నారు. డివిజన్ స్థాయి మీకోసం కార్యక్రమం జిల్లాలోని మూడు రెవెన్యూ డివి జనల్ అధికారుల కార్యాలయాలలో నిర్వ:హిస్తారని డివిజనల్ స్థాయి అధికారులంతా సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారికార్యాలయాలలో పాల్గొంటారన్నారు. మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్య క్రమం సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కార్యాలయాల్లో నిర్వహిస్తారని ఈ కార్యక్రమంలో సంబంధిత మండల తహాశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులంతా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

నేరాలు ఘోరాలు

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మురారి ఫారెస్ట్ ఏరియాలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. దీనికి సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు చిట్టిబాబు, ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి : మండలంలోని లచ్చిడిపాలెంలో ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ స్వామి, తుని ఎక్సైజ్ ఎస్ఐ శాస్త్రి, సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 140 లీటర్ల నాటు సారాను, 225 కేజీల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

పశువుల పాక దగ్ధం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం గ్రామ శివారు వెంకీయ్యమ్మ చెరువు సమీపంలో ఉన్న పశువుల పాక ఆదివారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన గొల్లు నానాజీ ఆదివారం సాయంత్రం పశువులను కట్టి ఇంటికి వచ్చారు. అనంతరం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సివుంది. ఈ ప్రమాదంలో గృహ అవసరాలకు ఉపయోగించే సామాగ్రితో పాటు ఎడ్లు బండి, సైకిల్, డ్రమ్ములు దగ్ధమయ్యాయి.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ఆదివారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి పెద్దాపురం పట్టణానికి చెందిన కొత్త విశ్వజిత్ సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆశాధులు, వేద పండితులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

వాకింగ్‌కి ప్రవేశం కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

రంగరాయ మెడికల్ కాలేజీ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో పబ్లిక్ వాకింగ్‌కి ప్రవేశం కల్పించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. ఆర్ఎంసిలోకి ప్రవేశం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా వాకర్స్‌కు నిర్దిష్ట వేళల ప్రకారం ప్రవేశం కల్పించే అవకాశాన్ని పెద్ద మనస్సుతో అంగీకరించాలన్నారు. ఆధార్ కార్డు, ఐడెంటిటీ కార్డు గుర్తింపుతో నగర పౌరులకు ఆర్ఎంసి మైదానానికి ప్రవేశ అర్హత కల్పించాలని కోరారు.

6న మరిడమ్మ పుట్టింటికి గరగల పయనం

ప్రజాశక్తి - పెద్దాపురం

సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని ఈనెల 6న మరిడమ్మ గరగలు పుట్టినిల్లు అయిన సామర్లకోటలోని చింతపల్లి ఇంటికి పయనం అవుతాయని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ప్రతిరూపంగా గరగలకు పాన్పు వేసి పూజలు చేస్తారన్నారు. ఆ రోజు ఉదయం 8:40 గంటలకు పెద్దాపురం మరిడమ్మ ఆలయం నుంచి బయలుదేరి డప్పుల దరువుల మధ్య గరగల నృత్యాలతో వెళతాయని అన్నారు.

రేషన్ షాపులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో చౌకు ధరల దుకాణ డీలర్లు నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తహశీల్దారు డి.అచ్యుత కుమారి తెలిపారు. లంకమాలపల్లి (ఓసి) ఎంవి.పాలెం (బిసి-ఎ మహిళ) కడింపాడు (ఎస్ఇ-మహిళ) పెరవలి (బిసి-బి మహిళ) పెరవలి (ఒసి) ముక్కామల (ఎస్‌సి మహిళ) రేషన్ డీలర్లు షాపులు శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. 18 ఏళ్ల వయసు నుంచి 40 ఏళ్ల లోపు ఉండి, కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ ఉన్న వారు దరఖాస్తులను ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు తహశీల్దారు కార్యాలయం లేదా సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - నిడదవోలు

గణపతి సెంటర్లో రోడ్డు మరమ్మతు పనులను మున్సిపల్ ఛైర్మన్ భూపతి అదినారాయణ, వైస్ ఛైర్మన్ గంగుల వెంకటలక్ష్మి తదితరులు ఆదివారం పరిశీలించారుర. వారి వెంట కౌన్సిలర్లు కారింకి నాగేశ్వరరావు, ఎండి షాకీరా బేగం, ముంగండి మాణిక్య మాల, చిలకల శారదాదేవి, మానుపాటి లక్ష్మి, జనసేన పట్టణ ప్రధాన కార్యదర్శి కొవ్వాడ బాలు, కార్యదర్శి నగినబోయిన నాగరాజు, సంయుక్త కార్యదర్శి అచ్యుత పవన్, జనసేన నాయకులు ఎండి ఫయాజ్, గంగుల గోపి, మద్దిపాటి ఫణీంద్ర, కృపానందం పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

ప్రజాశక్తి - నిడదవోలు

తిమ్మరాజుపాలెంలోని పద్మావతి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఎపి కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవంలో పేద కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. జనసేన పార్టీ నిడదవోలు టౌన్ అధ్యక్షుడు రంగ రమేష్, నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ పాల్గొన్నారు.

విఆర్‌ఒల సంఘం కార్యదర్శిగా సొంగరాజు

ప్రజాశక్తి-పెరవలి

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెరవలి విఆర్ఒ సొంగారాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం గ్రామ కచేరిలో ఆదివారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా గ్రామ రెవెన్యూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీందర్ రాజు పాల్గొన్నారు. వారి సమక్షంలో అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఆసుపత్రులపై చర్యలు

డిఎం హెచ్‌ఒ వెంకటేశ్వరరావు



ముఖాముఖి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణలో పారదర్శకత, నియంత్రణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి తనిఖీల నేపథ్యంలో ఆయన వివరాలను ప్రజాశక్తికి వెల్లడించారు.

జిల్లాలో తనిఖీలు ఎలా కొనసాగుతాయి

ఆసుపత్రులు 2007 నిబంధనల ప్రకారం అనివార్యంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇది లేకుండా సేవలను అందించడం చట్ట విరుద్ధం. రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేకుండా సేవలను అందించరాదు.ఆసుపత్రులు రోగుల నుంచి అధిక రుసుములు వసూలు చేయడం మరియు ఆసుపత్రి నిబందనలను ఉల్లంఘించేవారిపై చర్యల నిమిత్తం జిల్లాలో మూడు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాము. 50 నుంచి 100 పడకల్లోపు ఆసుపత్రులను డిఎంహెచ్‌ఒ నేతృత్వంలోనూ, 50 పడకల లోపు ఆసుపత్రులను కొవ్వూరు డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సంధ్యారాణి నేతృత్వంలోనూ, ల్యాబ్స్ స్కానింగ్ సెంటర్లు, రాజమండ్రి డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.సుధాకర్ నేతృత్వంలో తనిఖీలు జరుగుతున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఎటువంటి చర్యలు

రోగుల సేవలకు సంబంధించిన ప్రతి అంశంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని, ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఆసుపత్రులపై ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు, పెద్ద మొత్తంలో జరిమానా విధింపు, సంబంధిత వారిపై ఫిర్యాదులు నమోదు చేయడం, వంటి చర్యలు తీసుకుంటాము. ఆసుపత్రి భవనం విధిగా ఫైర్ సేఫ్టీ, రోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం అవసరమైన పార్కింగ్ స్థలం అందుబాటులో ఉండాలని భౌతిక అవసరాలను తీర్చే విధంగా మానవ వనరుల అభివృద్ధి శాఖ మార్గదర్శకాల ప్రకారం ఉండాలని, అంబులెన్స్‌లు, అత్యవసర వాహనాల కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని తెలిపారు.

ఇబ్బందులు ఎదురైతే వైద్య ఆరోగ్య శాఖకు ఫిర్యాదు చేయొచ్చు

ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి సేవలు పొందుతున్న ప్రజలు తమ హక్కులను తెలుసుకుని, ఏదైనా అన్యాయం జరిగితే సంబంధిత అధికారులను లేదా హెల్త్ డిపార్ట్మెంట్‌ను సంప్రదించాలి .ప్రతి ఆసుపత్రిని సమీక్షించి అవసరమైన చోట చర్యలు తీసుకోబడతాయి.ఆసుపత్రుల సేవలను మరింత మెరుగుపరచి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలి.అన్నిరకాల పరీక్షలను నిర్వహించగల సామర్థ్యం కలిగిన ల్యాబొరేటరీ తప్పనిసరిఅని,బయోకెమికల్ పరీక్షలు నాణ్యమైన ప్రమాణాలతో జరగాలని. లాబ్ టెక్నీషియన్లు గుర్తింపు పొందిన అర్హతలు కలిగి ఉండాలని, ఆసుపత్రికి అనుబంధంగా నడిచే ఫార్మసీ సేవలు డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ ప్రకారం నిర్వహించాలని రోగులకు మందుల ధరలపై పారదర్శకత పాటించాలి

ఆసుపత్రుల్లో పరిశుభ్రత పరిస్థితి ఏమిటి

ప్రతి ఆసుపత్రిలో రోగుల ఆరోగ్యాన్ని కాపాడటంలో పరిశుభ్రత అత్యంత కీలకం. ప్రతి ఆసుపత్రిలో శుభ్రత పాటించే విధంగా ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఆదేశించాము. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం నిర్వహించాలని, రోగులకు, వారి కుటుంబ సభ్యులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, అన్ని విభాగాల్లో అర్హత కలిగిన వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఉండాలని, డాక్టర్లకు అవసరమైన నైపుణ్యాల సర్టిఫికేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఆసుపత్రి సేవల ధరలను స్పష్టంగా బోర్డులపై ప్రదర్శించాలని, రోగుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాక్షికంగా కూలిన వంతెన

గ్రామస్తులకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం



శీలం వారి సావరం వెళ్లే రహదారిలో పాక్షికంగా కూలిన వంతెన

మండలంలోని శీలం వారి సావరం నుంచి వెల్ల వచ్చే మెయిన్ రోడ్డు మురుగు కాలువపై గల వంతెన నాలుగేళ్ల క్రితం పాక్షికంగా కూలిపోయింది. ఇంతకాలం అయినా దీనిని ఎవరూ పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. .బ్రిటిష్ వారి కాలంలో 1940లో దీనిని నిర్మించారు. రామచంద్రపురం నుంచి వచ్చే మురుగు కాలువపై ఈ వంతెన నిర్మించారు. సుమారు 74 సంవత్సరాల తర్వాత ఇది శిథిలావస్థకు చేరి ఒక వైపు కూలిపోయింది. ఇది కూలిపోయి నాలుగు సంవత్సరాల సుమారు అయింది. రెండుసార్లు ఈ వంతెనపై వెళుతూ ట్రాక్టర్లు కాలువ లో పడి ప్రమాదానికి కూడా గురైయ్యాయి. ఈ సమస్య పై అనేకసార్లు మండల సమావేశంలో అప్పటి మంత్రి వేణుతో మాట్లాడటం, గ్రీవెన్స్ సెల్ కి ఫిర్యాదు చేశామని గ్రామస్తులు అన్నారు. సంబంధిత అధికారులు వచ్చి నిధులు వచ్చిన వెంటనే నూతన బ్రిడ్జి నిర్మాణం చేస్తామని, చెప్పినా పనులు మాత్రం జరగడం లేదని రైతులు, గ్రామస్తులు తెలిపారు. దీనితో అనేక మంది రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను వెల్ల గ్రామం తీసుకురావడానికి వీలుకాక చుట్టు తిరిగి శీలం వారి సావరం నుంచి రామచంద్రపురం మీదుగా ఇంటికి తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. దాని అవతల శ్మశానం కూడా ఉండడంతో ఎవరైనా మరణించినప్పుడు తీవ్రమైన ఇబ్బంది కలుగుతుందని, ఇక రాత్రి సమయంలో ఈ వంతేన పై రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవలసి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ మురుగుగలపై వంతెన నిర్మించాలని, ప్రజలకు రైతులకు ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

శిథిలావస్థకు 'వెల్ల' లాకులు

- 1931 లో నిర్మాణం
- పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని గేట్లు
- ఆధునికీకరణ చేయాలని రైతుల విజ్ఞప్తి

లాకులు, పగిలిపోయిన గేట్లు

శిథిలావస్థకు చేరిన లాకులపై రోడ్డు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వెల్ల గ్రామంలో గల పంట కాలువ లాకులు శిథిలావస్థకు చేరుకుని ఆధునికీకరణ కోసం ఎదురుచూస్తున్నాయి. పంట కాలువలు ఇరిగేషన్ ప్రాజెక్టులను అభివద్ధి చేసిన బ్రిటిష్ వారి కాలంలో 1931లో దీనినే నిర్మించారు. సుమారు పది గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తూ 94 ఏళ్లుగా సేవలందించిన ఈ లాకులు పదిహేళ్లుగా శిథిలావస్థకు చేరుకున్నాయి. లాకుల గేట్లుకు రంధ్రాలు పడడంతో రైతులకు సాగునీరు సక్రమంగా ఉందని పరిస్థితి నెలకొంది. దీనిపై రైతులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన సరైన చర్యలు చేపట్టలేదు. గత ప్రభుత్వంలోనూ పాతకాలవల ఆధునికీకరణ, మరమ్మతులు లాకుల గేట్లు కనీసం పట్టించుకోకపోవడంతో గేట్లకు రంధ్రాలు ఏర్పడ్డాయి దీంతో నీటి నిల్వచేసి ఇతర కాలువలకు నీటిని మళ్లించేందుకు అధికారులకు శ్రమతో కూడుకున్న పనిగా లాకుల పరిస్థితి ఏర్పడింది. స్థానిక రైతులు గ్రామ ఎంపిటిసి సభ్యులు చిక్కాల స్వామి ఆధ్వర్యంలో పలుమార్లు లాకులను ఆధునికీకరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ దీనికి నిధులు మంజూరు కాకపోవడంతో గత పదేళ్లగా ఆధునికీకరణ పనులు జరగలేదు. ప్రస్తుతం దాళ్వా వరిచేలకు సాగునీరు అత్యంత అవసరం. రైతులు అధిక శాతం మంది దాళ్వా పంటపై ఆధారపడతారు. అధిక పెట్టుబడులు పెట్టినప్పటికీ సాగునీరు శివారు ప్రాంతాలకు సక్రమంగా అందకపోతే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం వరి నాట్లు పూర్తి చేసిన రైతులకు చేను ఈనే దశలోనూ పంట పండేటప్పుడు మరింత గా సాగునీటి అవసరం అవుతుంది. లాకులు ఆధునికీకరించితే ఇతర కాలువలకు నీరు మళ్లించేందుకు వీలువుతుంది. లేకుంటే లాకుల్లో నీరు లీక్ అయి పోవడం వల్ల ఇతర కాలువలకు నీరు సక్రమంగా అందే పరిస్థితి లేదని వెల్ల పరిసర గ్రామాల ప్రాంతాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పంట కాలువలను, లాకులను ఆధునికీకరణకు నిధులు కేటాయించి ఇప్పటికైనా ఆధునికీకరణ పనులు మొదలు పెట్టాలని, దాళ్వా పంటకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని వెల్ల పరిసర ప్రాంత గ్రామాల రైతులు ప్రజలు కోరుతున్నారు.

నాబార్డ్ నిధులతో ఆధునికీకరణ పనులు

వెల్ల గ్రామంలో పంటకాలువ లాకులు పరిస్థితిపై ఇరిగేషన్ ఎఇ వి.సుజాతను వివరణ కోరగా లాకులు నాబార్డ్ నిధులతో ఆధునికీకరణ, మరమ్మతులు పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. నాబార్డ్ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని ఈ సందర్భంగా ఆమె వివరించారు.

'మ్యాజిక్ ఫ్యామిలీ' సేవలు నిరూపమానం

ప్రజాశక్తి - ఆత్రేయపురం



ఎంఎల్‌సి ఐవికి సీఎల్ పుస్తకాన్ని అందజేస్తున్న శ్యామ్

ర్యాలికి చెందిన ఉపాధ్యాయుడు, ప్రముఖ మనస్తత్వవేత్త శ్యామ్ జాదుగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ సేవలు నిరూపమానమని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కె.లక్ష్మణ్, గోపి మూర్తి, వై.వెంకటేశ్వరరావులు అన్నారు. యుటిఎఫ్ 50 వసంతాల వేడుక కాకినాడలోని పిఆర్ కాలేజ్ గ్రౌండ్ లో జరిగిన సందర్భంగా శ్యామ్ ఉపాధ్యాయుల కొరకు ముద్రించిన సిఎల్ పుస్తకాలను పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవికి అందజేశారు. ఈ సందర్భంగా మ్యాజిక్ ఫ్యామిలీ విద్యా వ్యవస్థకు చేస్తున్న సేవలకు అభినందించారు.

పలువురికి ఎంఎల్ఎ వేగుళ్ల పరామర్శ

ప్రజాశక్తి - మండపేట

దేవదాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

మండలంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. ఏడిద గ్రామంలో కామన చినసుబ్బరాజు, సిద్ధాంతపు దేవదాసు కుటుంబ సభ్యులను, అర్తమూరు గ్రామంలో నార్కెడిమిల్లి చిట్టెమ్మ, కర్రి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంఎల్ఎ వేగుళ్ల వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, బుల్లి ఆదిరెడ్డి, చిర్ల వాసు, ద్వారంపూడి వీర్రాఘవరెడ్డి, చింతా వీర్రాఘవరెడ్డి సుధీర్ తదితరులు ఉన్నారు.

బెనిఫిట్ షోలపై జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

బెనిఫిట్ షోల నిర్వహణకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒను రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ జిఒ ద్వారా బెనిఫిట్ షో అర్థమే మారిపోతుందన్నారు. గతంలో బెనిఫిట్ షో ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఏదో ఒక సామాజిక కార్యక్రమానికి వినియోగించడం అనేది జరిగేదని, ప్రస్తుత విధానం చిత్రం నిర్మాతలకు లాభాలు చేకూర్చేలా ఉందన్నారు. సినిమా టికెట్లు ధర విషయంలో ఒక విధానం ఉండాలని, డిమాండ్ సప్లయిని బట్టి ధరలు పెంచుతామని ప్రభుత్వ పెద్దలు చెప్పడం అంటే అభిమానాన్ని దారుణంగా దోపిడీ చేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. తక్షణమే ప్రభుత్వం సంబంధిత జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వేణుగోపాల్‌పై దాడి అమానుషం

ప్రజాశక్తి - కాకినాడ

హైదరాబాదులోని ఒక బుక్ ఫెస్టివల్‌లో పాత్రికేయుడు, సామాజికవేత్త, కవి,రచయిత అయిన ఎన్.వేణుగోపాల్‌పై ఒక వ్యక్తి దాడి చేయడం అమానుషమని మాజీ ఎంఎల్‌సి, జన విజ్ఞాన పత్రిక ఎడిటర్ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ దుకాణంలో అమ్ముతున్న ఒక పుస్తకం తనకి ఇష్టం లేకపోవడంవల్లే ఆ వ్యక్తి దాడి చేశారన్నారు. ఇంకోసారి అమ్మితే ప్రాణం తీస్తామంటూ బెదిరింపులు పాల్పడడం దారుణం అన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో బుక్ ఫెస్టివల్‌లో ఇటువంటి దాడి జరగడం ఇదే మొదటి సారన్నారు. బుక్ ఫెస్టివల్‌లో రకరకాల పుస్తకాలు ఉంటాయన్నారు. అన్ని రకాల ఆలోచనలు, సమాధానాలు, ప్రశ్నలు, అభిప్రాయాలు పుస్తకాల్లో ఉంటాయన్నారు. పుస్తకాల పైన, రచించిన రచయితల పైన అమ్మకాలు చేస్తున్న వారిపై ఇటువంటి భౌతిక దాడులను జెవివిగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భిన్నమైన ఆలోచనలు భరించలేక దాడి చేశారన్నారు. జన విజ్ఞాన వేదిక తరపున ఎన్.వేణుగోపాలకు అండగా ఉంటామన్నారు. పాఠకులు, పుస్తక ప్రియులు, సాహిత్య వేత్తలు,రచయితలు ప్రజాస్వామ్యవాదులు అందరం ఈ తరహా ధోరణులను ఖండించాలన్నారు. పరిస్థితి చూస్తుంటే గౌరీ లంకేష్, కల్బుర్గి వారిపై జరిగిన ఘటనలు గుర్తుకొస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య వాతావరణ నెలకొల్పేందుకు అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి జి.మురళీధర్, జెవివి జిల్లా అధ్యక్షులు కెఎంఎంఆర్.ప్రసాద్, జెవివి బాపట్ల జిల్లా అధ్యక్షులు జె భాస్కరరావు, తదితరులు ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు గొల్లపాలెం క్రీడాకారులు

ప్రజాశక్తి - కాజులూరు

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి దేగల వీరపవన్, 9వ తరగతి విద్యార్థిని దడాల సంజన ఎంపిక అయ్యారని గొల్లపాలెం జడ్‌పి పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎస్‌పి.సుశీలమణి తెలిపారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ మహారాష్ట్ర జల్గాన్‌లో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ - 17 సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాల, బాలికల జట్టులో తమ విద్యార్థులు పాల్గొననున్నారని తెలిపారు. విద్యార్థులను ఎంపిడిఒ రాంబాబు, ఎంఇఒ డేవిడ్‌జాన్, ఎస్ఎంసి ఛైర్మన్ కొలిశెట్టి సత్యం, సర్పంచ్ పి.ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం అన్నారు. ప్రత్తిపాడులో నూతనంగా ప్రారంభమైన దేవర్ష్ ఆసుపత్రిని ముద్రగడ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్పటల్ వైద్యులు డాక్టర్ విజయ, డాక్టర్ అంజినాయక్‌లు ఆసుపత్రిలో ఉన్న వైద్య సేవలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన ముద్రగడ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సేవలు ప్రత్తిపాడులో ప్రారంభించడం శుభ పరిణామం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు లేకపోవడంతో కాకినాడ, రాజమహేంద్రవరం వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తుందని, ఆ అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లోనే అన్ని అవసరాలతో కూడిన వైద్య సేవలు అందుబాటులో తీసుకురావడం అభినందనీయమన్నారు.

పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎర్రపోతవరంలో చలిమంట కాగుతున్న చిన్నారులు

గత కొద్ది రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. దీంతో పాటు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కనీస ఉష్ణోగ్రతలు 18 డిగ్రీలకు చేరుకున్నాయి. ఉదయం, సాయంత్రం పొగ మంచు కమ్ముకుంటోంది. దీంతో పల్లెల్లో చలికి తట్టుకోలేక ప్రజలు చలి మంటలు వేసుకుని చలి కాచుకుంటున్నారు. జనవరి మొదటి వారంలోనే చలి తీవ్రత అధికం కావడంతో ముందు ముందు మరింత చలి పెరిగే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. ఉదయం కురుస్తున్న పొగ మంచుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

బాధిత కుటుంబానికి యుటిఎఫ్ అండ

ప్రజాశక్తి - కాజులూరు

ఉపాధ్యాయులకు యుటిఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర మాజీ క్యాదర్శి జి.ప్రభాకర్ వర్మ అన్నారు. ఇటీవల మండలంలోని తిప్పరాజుపాలెం శివారు అంచెమ్మ చెరువు పాఠశాలలో విధులు నిర్వరిస్తూ అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు పినిపె శేషమహాలక్ష్మి మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం ద్వారా మంజూరు అయిన రూ.3 లక్షల సంఘీభావ చెక్కును శేష మహాలక్ష్మి భర్త రేవు నాగేశ్వరావుకి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ సభ్యులకు తమ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు భానుప్రకాష్, నున్నబోయిన గణేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కళారంగాన్ని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

అంతరించిపోతున్న కళారంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎస్ఐ మౌనిక అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్లో నాటిక పరిషత్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సాంస్కృతిక, జానపద కళారూపాలు, నాటికలు, నాటకాలు వంటివి కనుమరుగు అవుతున్నాయన్నారు. దీంతో మంచి, మానవత్వం, సమాజ హితం, మానవ సంబంధాల గురించి వివరించేవారు లేకుండా పోయారన్నారు. ప్రతి ఒక్కరూ కళారంగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈనెల 24, 25, 26 తేదీల్లో మండలంలోని చంద్రమాంపల్లి జడ్‌పి హైస్కూల్లో స్నేహ స్టార్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే కళారూప ప్రదర్శనలను జయప్రదం చేయాలని నాటిక పరిషత్ అధ్యక్షులు గుందేసి రాజా కోరారు. ఈ కార్యక్రమంలో కేదారి నాగు, మంతెన సత్తిబాబు, దేవాడ పాపేశ్వరరావు, పాలాని సత్తిబాబు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకుందాం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అనాథ పిల్లలను ఆదుకోవడం కర్తవ్యంగా భావించాలని జిల్లా మూడవ అదనపు జడ్జి కమలాదేవి అన్నారు. ఆదివారం మండలం లోని వలసపాకల గ్రామంలో ఉన్న జీవన స్ఫూర్తి చిల్డ్రన్ హోంను న్యాయమూర్తి కమలాదేవి నేతృత్వంలో న్యాయమూర్తుల బృందం సందర్శిం చింది. హోంలో ఉన్న చిన్నారులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని పండ్లు, కేక్‌లను అందజేశారు. ఒక నెలకు సరిపడా నిత్య వసర సరుకులు హోం నిర్వహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాథ పిల్లలను ఆదుకోవాలనే లక్ష్యంతో 16 మంది న్యాయమూర్తులతో కలిసి ఈ హోంను సందర్శించినట్లు చెప్పారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లల అవసరాలను, సమస్యలను తెలుసుకుని వారికి సహాయపడటం చాలా సంతృప్తిని ఇచ్చిందన్నారు. అనాథ పిల్లల అవసరాలను గుర్తించి సరైన తోడ్పటును అందించడం ద్వారా భవిష్యత్తులో వారు ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు గొప్ప అవకాశం కలుగుతుందని అన్నారు. మానవసేవే- మాధవసేవగా భావించి పండుగల సందర్భాల్లో విందులు, వినోదాలు నిర్వహించుకుంటూ ధనాన్ని ఎక్కువగా వృధా చేయకుండా ఇటువంటి చిన్నారులను ఆదుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చిన్నారులకు అవసరమైన సరుకులను అందించిన న్యాయమూర్తుల బృందానికి చిల్డ్రన్ హోం ప్రతినిధి సత్యవేణి కృతజ్ఞతలు తెలిపారు.

నిత్య వ్యాయామంతో ఆరోగ్య పరిరక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ వైద్య సలహాలు పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడం సాధ్యమవు తుందని విజన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎస్ మహోన్నత్, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ ఎస్.మాధురి అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఆదివారం గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత బిపి, సుగర్, నేత్ర పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఆరోగ్యాన్ని కాపాడుకునే చిట్కా మన చేతుల్లోనే ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మన జీవితాల్లో ఎదురవుతున్న అధిక వత్తిడి, ఆహార అలవాట్లలో మార్పుల కారణంగా బలహీనతలు వస్తున్నాయని అన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా మానసిక వత్తిడి తగ్గి, ఆహార నియమాలు పాటించడం ద్వారా బలహీనతలను జయించ గలుగుతామన్నారు. ఈ సందర్భంగా బిపి, సుగర్, నేత్ర సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి సైపుల్లా, కార్యదర్శి విప్పర్తి కొండలరావు, నాయకులు వారిష్‌లను ఘనంగా సత్కరించారు. ఈ శిబిరంలో అసోసియేషన్ నాయకులు ఊభా జాన్ కెనడి, నక్కా శ్రీనివాసు, గుండు శంకర్రావు, లింగం శివ ప్రసాద్, గోలి సత్తిరాజు, పిట్టా జానకి రామారావు, తామస్ గాబ్రియేల్ పాల్గొన్నారు.

కేసులకు భయపడేది లేదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మూసివేసిన జీడిపిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలని ఆందోళన చేస్తున్న కార్మికులు కేసులకు భయపడరని యాజమాన్యం గుర్తించు కోవాలని సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ర్యాలీగా అల్లూరి సీతారామరాజు సెంటర్‌కు చేరుకుని మానహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయంగా ఫ్యాక్టరీని మూసివేసిన యాజమాన్యం చర్యలను నిరసిస్తూ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరుతూ గత 51 రోజులుగా వివిధ రూపాల్లో ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్థాంతరంగా పరిశ్రమను మూసేసి వెళ్ళిపోతే కార్మికులు చూస్తూ ఊరుకోరని, ఉద్యమించి హక్కు లను సాధించుకుంటారని అన్నారు. పరిశ్రమను తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలని కోరుతుంటూ కార్మికులపై కేసులు పెట్టడం సరికాదని, ఈ కేసులతో కార్మికులు భయపడరని గుర్తుంచుకోవాలన్నారు. కార్మికులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం చొరవ తీసుకుని అవసరమైతే పరిశ్రమను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అనిశెట్టి వీరబాబు, కె.చక్రధర్, వీరబాబు, కృష్ణారావు, ఎం.శివ, అచ్యుతరామయ్య, శేషు, అన్నపూర్ణ, పాపారత్నం, భాగ్యలక్ష్మి, సత్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
EP No.1/2011
OS No. 345/2005

Between :
శ్రీ గంగిన వెంకట సత్యన్నారాయణ
S/o రంగారావు @ పెదరంగారావు, హిందు
R/o కాతేరు - DHR
మరియు
1) మారెడ్డి జగ్గారావు (Died)
2) మారెడ్డి అనిల్ కుమార్
తండ్రి లేటు జగ్గారావు, హిందు, భీమోలు గ్రామం, గోపాలపురం మండలం
3) తోట శైలజ, భర్త తోట రామచంద్రుడు, హిందు, పరింపూడి గ్రామం, కొయ్యలగూడెం మండలం
-JDr లు

నోటీసు

పై నెంబరు EP గ్రంధములో డిక్రీబాకీ వసూలు నిమిత్తం JDr లకు చెందిన EP షెడ్యూలు ఆస్తిని పై శ్రీకోర్టు వారు ది. 20-1-2025 సం॥ తేదీన పై కోర్టులో ఉదయం 10.30 ని॥లగాయితు వేలం వేయుదురని, ఆసక్తి కలవారు పాల్గొని పాడుకొనవచ్చునని, అందు యావత్తు సమాచారము శ్రీ కోర్టువారి నజారత్ ఆఫీసు నుండి గాని, DHr న్యాయవాది వారి ఆఫీసు నుండి కాని తెలుసుకోవచ్చునని యిందు మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

వేలం యిస్తిహారు దాఖలా షెడ్యూలు ఆస్తి వివరం

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం మండలం, వేగేశ్వరపురం, సబ్-రిజిష్ట్రారు వారి ఆఫీసులో చేరిన, భీమోలు గ్రామ పంచాయితీ, భీమోలు గ్రామం తాలూకు, 2 మరియు 3 JDr లు స్వాధీన, హక్కు భుక్తములో వున్న జిరాయితీ మెరక JDr దాఖలా ఎ. 2-50 సెంట్లలో అవిభాగపు వాటా (Undivided Share) ఎ. 1-50 సెంట్లు భూమికి హద్దులు :
తూర్పు : ఎ. అచ్చయ్య భూమి, దక్షిణం : పుంత, పడమర : పుంత, ఉత్తరం : మారెడ్డి త్రిపుర భూమి.

యీ హద్దుల మధ్యస్తమైన ఎ.2.50 సెంట్లు భూమిలో అవిభాగపు వాటా (Undivided Share) ఎ. 1-50 సెంట్లు భూమి యావత్తు యీజిమెంటు హక్కులతో సహా.

D.Hr. విలువ : రూ. 1,25,000/-
Amin విలువ : రూ. 24,00,000/-
S.R.O. విలువ : రూ. 16,50,000/-
J.Dr. విలువ : శ్రీ కోర్టువారికి J.Dr. విలువ తెలియపర్చియుండలేదు.

శ్రీ కోర్టు వారి అనుమతితో
శ్రీ Ch. వెంకటేశ్వరరావు
శ్రీ S. సుబ్బారావు
D.Hr తరుపు అడ్వకేట్లు
కొవ్వూరు

కొవ్వూరు
2-1-2025